# సారొస్తున్నారు..

- నేడు ఇబ్రహీంపట్నంలో ప్రజా ఆశీర్వాద సభ
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు
- రంగారెడ్డి జిల్లాలో తొలి సభ కావడంతో భారీ జన సమీకరణకు ఏర్పాట్లు
- ఇబ్రహీంపట్నంతోపాటు సభా ప్రాంగణంలో రెపరెపలాడుతున్న గులాబీ జెండాలు, నేతల కటౌట్లు
- సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- గులాబీ బాస్ రాకతో కొత్త పుంతలు తొక్కనున్న ప్రచారం



రంగారెడ్డి, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఉద్యమాల గడ్డ ఇబ్రహీంపట్నానికి బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం వస్తున్నారు. రెండో విడుత ఎన్నికల ప్రచారంలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సాయంత్రం 3 గంటలకు జరిగే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు నేతలు ఘనంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో తొలి ఎన్నికల ప్రచార బహిరంగ సభ కావడంతో సక్సెస్ చేసేందుకు భారీగా జనాన్ని సమీకరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం శివారులో హైదరాబాద్-సాగర్ హైవే పక్కనే దేవరకొండ వైపునకు వెళ్లే మార్గంలో విశాలమైన స్థలంలో ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు చేశారు. గతంలో కూడా ఇక్కడే సీఎం సభలను నిర్వహించడంతో.. అదే సెంటిమెంట్‌తో ఎమ్మెల్యే మంచిరెడ్డి ఈసారి కూడా సభను అదే స్థలంలో నిర్వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో రానుండగా.. సభా స్థలికి పక్కనే హెలీ ప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన ఏర్పాట్లను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. గులాబీ బాస్ రాకతో జిల్లాలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కనున్నది.



బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లు

## భారీ జన సమీకరణతో సభ

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభను బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతోపాటు ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీల నుంచి భారీగా జనాన్ని సమీకరించేలా బూత్ కమిటీలకు బాధ్యతలు అప్పగించారు. సభకు తరలివచ్చేందుకు లబ్ధిదారులతోపాటు సబ్బండ వర్ణాల ప్రజానీకం సిద్ధమవుతున్నది. 70వేల మందికి పైగా సభకు తరలివచ్చే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు. సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సభకు వచ్చే వీఐపీలు, మీడియా, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు ఇలా.. వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సభాస్థలికి నలువైపులా కొద్ది దూరంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దగ్గరుండి సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## ఇబ్రహీంపట్నం గులాబీమయం

సీఎం కేసీఆర్ పాల్గొనే ఎన్నికల బహిరంగ సభకు ఇబ్రహీంపట్నం ముస్తాబైంది. పట్టణంలోని రోడ్లన్నీ గులాబీ జెండాలతో రెపరెపలాడుతున్నాయి. ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట గులాబీ ఫ్లెక్సీలు, జెండాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణాన్ని గులాబీమయం చేశారు. గులాబీ జెండాలు చేతబట్టుకుని ర్యాలీగా పెద్దఎత్తున జనం సభా ప్రాంగణానికి చేరుకోనుంది. ప్రజలు దూరం నుంచి కూడా సభను వీక్షించేందుకు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

## అభివృద్ధి ప్రదాతకు అపూర్వ స్వాగతం పలకాలి

ఇబ్రహీంపట్నం : నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు ఇబ్రహీంపట్నం విచ్చేస్తున్న సందర్భంగా ఆయనకు అపూర్వ స్వాగతం పలకాలని బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి మంగళవారం 3 గంటలకు ఇబ్రహీంపట్నంలో జరిగే బహిరంగ సభకు హాజరవుతారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంపై ప్రత్యేక అభిమానం ఉన్నదని.. ప్రతిసారి ఇబ్రహీంపట్నం వచ్చిన సందర్భంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించారన్నారు. గత పదేండ్లలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.2931 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదని తెలిపారు. 85 నుంచి 90 స్థానాలు బీఆర్‌ఎస్‌కు రావడం ఖాయమని.. ఇబ్రహీంపట్నంలో కూడా తాను మంచి మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సాగర్ రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా మార్చడానికి రూ.420 కోట్ల అవసరమని.. ఈ విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానన్నారు. అలాగే తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడ వద్ద 170 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్ల మార్కెట్ నిర్మాణానికి రూ.418 కోట్లు కేటాయించేలా.. శివన్నగూడ ఎత్తిపోతల ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్‌తో నియోజకవర్గంలోని 75 వేల ఎకరాలకు సాగు నీరందించాలని సీఎంను కోరనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మల్లేశ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మంచాల ఎంపీపీ నర్మద, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు శంకరయ్య, సుజాత, సుధాకర్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, నాయకుడు అరవింద్ ఉన్నారు.



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి, క్యామ మల్లేశ్

## 22న పరిగిలో సీఎం కేసీఆర్ బహిరంగసభ

పరిగి : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరిగిలో ఈ నెల 22న జరిగే భారీ బహిరంగసభలో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. గత ఎన్నికల సమయంలో నిర్వహించిన జింఖానా గ్రౌండ్‌లోనే ఈసారి కూడా బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు బహిరంగసభ స్థలాన్ని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. గ్రౌండ్‌ను పూర్తి స్థాయిలో శుభ్రం చేయించాలని, చెత్తాచెదారాన్ని తొలగించే పనులు వెంటనే ప్రారంభించాలని పార్టీ నాయకులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రౌండ్ పూర్తిస్థాయిలో చదును చేసి బహిరంగసభకు ఏర్పాట్లు చేపట్టేందుకు అవసరమైన విధంగా తయారు చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, ఎంపీపీ అరవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీర్ మహమూద్‌అలీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు రవీంద్ర, వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు రవికుమార్, అశోక్, నజీర్, సమద్, తాహెర్ అలీ పాల్గొన్నారు.

# మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట

- మైనార్టీ గురుకులాలతో కార్పొరేట్ విద్య
- పేదలకు అందుబాటులో వైద్య సేవలు
- 268 మందికి రూ.2.32 కోట్ల షాదీముబారక్
- రేవంత్‌రెడ్డివి మాటలే.. పనులు చేతకావు.. అవకాశవాది
- మైనార్టీలను నిండా ముంచిన కాంగ్రెస్
- 2014కు ముందు మైనార్టీలు అన్ని రంగాల్లో వెనుకబాటు
- రాష్ట్ర హోం శాఖామాత్యులు మహమూద్‌అలీ
- కోస్గిలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం
- పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కొడంగల్, నవంబర్ 13 : ఢిల్లీ నాయత్వం వద్దు.. గల్లీ నాయకత్వమే కావాలని, 2014కు ముందు మైనార్టీలను అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని రాష్ట్ర హోం శాఖామాత్యులు మహమూద్‌అలీ తెలిపారు. సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తోనే మైనార్టీల అభ్యున్నతి సాధ్యపడుతుందని, గతంలో ఏ ప్రభుత్వాలు కూడా మైనార్టీలను పట్టించుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచే మైనార్టీల మనుగడ ప్రారంభమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓటు బ్యాంకులా మాత్రమే వాడుకుందన్నారు. రేవంత్‌రెడ్డివి ఉట్టి మాటలే తప్ప.. చేతలు చేతకావని.. అబద్దపు మాటలను నమ్మవద్దన్నారు. అవకాశవాది అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మతాల చిచ్చు పెట్టి అధికారాన్ని చలాయించిందని ఆరోపించారు.

బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత హైదరాబాద్ చాలా ప్రశాంతంగా ఉందని ప్రజలు తెలుసుకోవాలన్నారు. నేడు సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి తలమానికంగా మారిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ముస్లింలను ఎంతగానో ఆదరిస్తున్నదని.. గతంలో డిప్యూటీ సీఎంగా, ప్రస్తుతం హోం మంత్రిగా అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. మసీదుల్లో ఉండే మౌజం, ఇమాంలకు ప్రతి నెలా రూ.5వేల గౌరవ వేతనాన్ని అందిస్తున్నదని, ఇప్పటివరకు రూ.304 కోట్లు ఇమాం, మౌజంల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఇమాం, మౌజంలకు రూ.10వేలకు పెంచే హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో 4 మైనార్టీ పాఠశాలలను ఏర్పాటు చేసి లక్షా40వేల మంది విద్యార్థులకు రూ.3,300 కోట్లు ఖర్చు చేసిందన్నారు. నేడు కార్పొరేట్ తరహాలో ముస్లిం చిన్నారులు విద్యను అందుకుంటున్నట్లు తెలిపారు. 2,520 మంది విద్యార్థులు మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. షాదీముబారక్ కింద ఇప్పటివరకు 268 మందికి రూ.2.32 కోట్లు అందజేసినట్లు తెలిపారు. నేడు మరో గాంధీగా కేసీఆర్‌ను ప్రజలు ఆదరిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో రైతు బంధు రూ.16వేలకు, సౌభాగ్యలక్ష్మి పథకంతో ప్రతి మహిళకు రూ.3వేలు, తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు రూ.5లక్షల బీమా, రూ.400లకే గ్యాస్ సిలిండర్ వంటి ఎన్నో అద్భుతమైన పథకాలున్నాయన్నారు. మైనార్టీలు కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో పెద్దమొత్తంలో మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించే హామీని సీఎం ఇచ్చినట్లు తెలిపారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సాధిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి పూర్తి మద్దతు తెలపాలని, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టుకొని తెలంగాణకు బంగారు బాటలు వేసుకుందామని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహమూద్‌అలీ, పక్కన మంత్రి మహేందర్‌రెడ్డి

## మైనార్టీల అభ్యున్నతి కేసీఆర్‌తోనే సాధ్యం

మైనార్టీల అభ్యున్నతి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యపడుతుందని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. కోట్లాది నిధులతో మసీదులు, ఈద్గాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ముస్లింల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంతో ముస్లింలు విద్యాపరంగా, ఆర్థికంగా, అభివృద్ధిపరంగా సౌకర్యాలను అందుకుంటున్నారని, రూ.36 కోట్లతో మైనార్టీ పాఠశాలలను ఏర్పాటైనట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో 6 గ్యారెంటీల హామీ ఇస్తున్నదని, కాంగ్రెస్‌కే గ్యారెంటీ లేదు కానీ 6 గ్యారెంటీలు అని చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. గతంలో ఈ గ్యారెంటీలు ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఎంత ఇస్తే.. తాను అంతకంటే రెట్టింపు ఇస్తానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అడ్డదారిలో అధికారాన్ని దక్కించుకోవాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

## మైనార్టీలకు రూ.13 కోట్లు మంజూరు

నియోజకవర్గ పరిధిలో మైనార్టీలకు రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు చేయించినట్లు ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌రెడ్డి తెలిపారు. మైనార్టీ రెసిడెన్షియల్, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసి ఉత్తమ విద్యను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గతంలో ఇటువంటి ప్రోత్సాహం లేక చదువుకు దూరంగా ఉండి వెట్టిచారికీ పనులతో కాలం గడిపేవారని, నేడు ఉన్నత విద్యలో రాణించి సమాజంలో ఉన్నత స్థానంలో నిలుస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మసీదుల పునరుద్ధరణ, ఈద్గాల నిర్మాణం వంటి పనులు జరిగినట్లు తెలిపారు. రూ.150 కోట్ల మైనార్టీ లోన్స్, కోస్గిలో 5 ఎకరాల్లో వైకుంఠధామం స్థలం, రూ.10లక్షలతో కాంపౌండ్‌వాల్, ఈద్గా వంటి వాటికి రూ.15లక్షలు, మైనార్టీ గురుకుల భవన నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్, రాష్ట్ర ఫైనాన్స్ డైరెక్టర్ ఎండీ సలీం, ఎన్నికల ఇన్‌చార్జి కృష్ణారావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఇంతియాజ్, ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, బీఆర్‌ఎస్ నాయకులు, మైనార్టీ నాయకులున్నారు.